సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ సైదులు

బౌద్ధనగర్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ సైదులు సూచించారు. శనివారం వారాసిగూడలోని శ్రీబాలాజీ హైస్కూలులో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ.. ప్రస్తుత హైటెక్ జీవనంలో నిత్యం ఎన్నో సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రుల సెల్‌ఫోన్ ఉపయోగించే పిల్లలు ఫోన్లో వచ్చే అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. ఈ అవగాహన సదస్సులో స్కూల్ కరెస్పాండెంట్ సుదేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటుపోట్లను ఎదుర్కొంటూ ముందుకెళ్లాలి

• ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: జీవితంలో వచ్చే ఆటుపోట్లను ఎదుర్కొంటు తాము అనుకున్న లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించకుండా ముందుకు వెళ్లాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శనివారం విమన్‌నగర్‌లోని మమత హైస్కూల్ వార్షికోత్సవం హరిహర కళాభవన్‌లో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు పట్టుదల, అంకితబావంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. తాను ఎమ్మెల్యే అయ్యేందుకు 15 సంవత్సరాల పాటు ఎంతో పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన విభిన్న రకాల ఆటాపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి శ్రీధర్, పాఠశాల సొసైటీ చైర్మన్ వసంతరావు, డైరెక్టర్ భరత్‌భూషన్, ప్రిన్సిపాల్ ఇందిరా రాణి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు అబిద్ అలి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



మల్లికార్జునుడికి బిల్వార్చన, పుష్పార్చన

సనత్‌నగర్: కార్తీక మాసం బహుళ చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని శివాలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే బిల్వార్చన, పుష్పార్చన కార్యక్రమం అనంతరం ప్రత్యేక అలంకరణ భక్తులను కనువిందు చేసింది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో కార్తీక మాస విశేష పూజలు కొనసాగాయి.

తెలంగాణలో బోయలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో వాల్మీకి బోయలకు తీరని అన్యాయం జరుగుతోందని బోయ హక్కుల పోరాట సమితి (బీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మీనగ గోపిబోయ, యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు బోయ రమేష్ పేర్కొన్నారు. శనివారం ఓయూలో వారు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించగా తెలంగాణలో బోయలను బీసీ–ఏ కెటగిరిలో పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పది లక్షల జనాభ గల బోయ కులం నుంచి ఇంత వరకు ఒక్క ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు కాలేదన్నారు. 108 ఏండ్ల ఓయూలో బోయకులానికి చెందిన ఒక్కరు కూడ ప్రొఫెసర్ కాకపోవడం బాధకరమన్నారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రెండు సార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. దీంతో పాటు చెల్లప్ప కమిటీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని నివేదికను సమర్పించిన కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సీఎం రేవంత్ రెడ్డితో పాటు 11 మంది ఎమ్మెల్యేలకు సైతం వినతి పత్రాలను అందచేసినట్లు తెలిపారు

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన అవసరమని వక్తలు పేర్కొన్నారు. శనివారం ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో ఎన్ఎస్ఎస్, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై సదస్సు జరిగింది. ప్రిన్సిపల్ ప్రొ.గంగాధర్ అధ్యక్షత వహించగా ఐసీటీసీ కౌన్సిలర్ డా.శివప్రసాద్, విజన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కై లాష్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సోషల్ వర్క్ కోర్సు విద్యార్థులు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.మృధుల లక్కరాజు, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డా.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ డ్రామాలు

రాంగోపాల్‌పేట్: దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ పార్టీ డ్రామాలు ఆడుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్టెల శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. శనివారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పదేళ్లు అధికారంలో ఉండి దీక్షా దివస్ చేసుకోని ఆ పార్టీ నాయకులు ఇప్పుడు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1500 మంది విద్యార్థులు, ఉద్యమకారులు తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్నారని, వారి కుటుంబాలను ఏ రోజైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు.

పద్మశాలీలకు సముచిత స్థానం కల్పించాలి

ముషీరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షలకు పైగా ఉన్న పద్మశాలీ కులస్తులకు రాజకీయ, ఉద్యోగాల్లో జనాభా ప్రతిపాదికన సముచిత స్థానం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర డెడికేటేట్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం నుంచి రుణాలు అందేలా సహకరించాలన్నారు.

పౌర హక్కులపై అవగాహన



సదస్సులో పాల్గొన్న మారేడ్‌పల్లి మండల సీనియర్ అసిస్టెంట్ మోహన్

అడ్డగుట్ట: ప్రతి ఒక్కరికీ పౌర హక్కులపై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని మారేడ్‌పల్లి మండల సీనియర్ అసిస్టెంట్ మోహన్ పేర్కొన్నారు. తుకారాంగేట్ గడ్డమీది బస్తీలోని కమ్యూనిటీహాలులో శనివారం 'పౌర హక్కుల' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మండల సీనియర్ అసిస్టెంట్ మోహన్ మాట్లాడుతూ పౌర హక్కుల పై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. తమ హక్కులను ఏ విధంగా సాధించుకోవాలనే విషయాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బస్తీనాయకులు కేఎస్. సుధాకర్, రమాదేవి, ఉమా శంకర్, వినోద్, శ్రీహరి, కవిత, వసంత, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది చిత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా



ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేద ప్రజలకు వైద్య సేవల విషయంలో అన్నివిధాలా అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద బన్సీలాల్‌పేట్‌కు చెందిన ఆసియా బేగం వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయం పత్రాన్ని (ఎల్ఓసీ) భర్త వసీంకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు లక్ష్మీపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితుల్లో భరోసా కల్పించాలి



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు.

రసూల్‌పురా: ఎయిడ్స్ నిర్మూలన కోసం మనమంతా బాధ్యతతో పనిచేయాలని ఎయిడ్స్‌కు గురైన వారిని కూడ మనుషులుగా గుర్తించి వారికి భరోసా కల్పించాలని సికింద్రాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. టి. గంగాధర్ అన్నారు. పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ ఎయిడ్స్‌డే సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలన కోసం సామాజిక బాధ్యతతో వ్యవహరించాల న్నారు . విశిష్ట అతిథి డా. శివప్రసాద్ మాట్లాడుతూ యువత చెడు దురలవాట్లకు అలవాటు పడి తమ ఉజ్వలమైన భవిష్యత్తు పాడుచేసుకోవద్దని అని కోరారు.

సందడిగా ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఎస్ఆర్‌నగర్ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి మధురానుభూతులను సొంతం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ, కమ్మ సేవా సమితి ప్రతినిధులు సూరినేని మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చిలకలగూడ: చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నేడు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పుష్పగిరి విట్రియో రెటీనా ఇనిస్టిట్యూట్, మా ఈఎన్‌టీ ఆస్పత్రుల వైద్యులు ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందిస్తారు. చిలకలగూడ, దూద్‌బావి, చింతబావి, పాండవబస్తీ, దాతర్ కాంపౌండ్, జోషికాంపౌండ్, మైలార్‌గడ్డ, నామాలగుండు, సీతాఫల్‌మండి, ఉప్పరిబస్తీ, వారాసిగూడ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని దూద్‌బావి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జునరెడ్డి కోరారు.

14 లోగా ఏకసభ్య వర్గీకరణ కమిషన్‌కు విజ్ఞప్తులు పంపాలి



సమావేశంలో మాదిగ, ఉప కులాల సంఘాల నేతలు

సనత్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా చర్యలు తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎస్సీ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 14 లోగా ఏకసభ్య వర్గీకరణ కమిషన్‌కు విజ్ఞప్తులు పంపాలని మాదిగ, ఎస్సీ ఉప కులాల సంఘాల నాయకులు, ఉద్యోగులు, మేధావులను కోరారు. బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో శనివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మాదిగ, ఎస్సీ ఉపకులాల సంఘాల నేతల సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు చింతస్వామి మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్‌మాదిగ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వర్గీకరణ అనుకూల విధానానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు, వ్యాఖ్యానాలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజులపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఉప కులాల సంఘాలన్నీ డిమాండ్ చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఉప కులాల సంఘాల నేతలు పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ కోర్సులను పునరుద్ధరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పర్యవేక్షణలో నగరంలోని కార్పొరేట్, ప్రవేటు ఆసుపత్రుల్లో గతంలో డిగ్రీ అర్హతతో కొనసాగిన 14 పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సులను పునఃరుద్ధరించాలని సైన్స్ విద్యార్థులు వీసీ ప్రొ.కుమార్‌ను శనివారం కోరారు. కరోన సమయంలో ప్రవేశాలను నిలిపివేసిన ఆసుపత్రులు తర్వత కోర్సుల పునరుద్ధరించాలని ఓయూ అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి



వికలాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్: మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు అన్ని విధాలా అండగా ఉండాలని పలువురు వక్తలు అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో శనివారం లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ అధ్వర్యంలో వీల్‌చైర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ గౌడ్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు ఎ. శ్రీనివాస్‌ముదిరాజ్, డి. అరుణ్‌కుమార్ తదితరుల మాట్లాడారు. సమస్యలతో బాధపడుతున్న దివ్యాంగులను అక్కున చేర్చుకొని ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజేందర్, పద్మ, లావణ్య పాల్గొన్నారు.

దృష్టి మరల్చి సెల్‌ఫోన్‌తో పరార్

అమీర్‌పేట: ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ అగంతకుడు దృష్టి మరల్చి సెల్‌ఫోన్‌తో ఉడాయించిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన రిహాన్ శుక్రవారం రాత్రి మెట్రోరైల్‌లో వచ్చి అమీర్‌పేటలో దిగాడు. పార్కింగ్‌లో పెట్టిన సైకిల్ తీసుకుని బయలు దేరాడు.అమీర్‌పేట చౌరస్తాలో ఫోన్ మాట్లాడి ఫోన్ జేబులో పెట్టుకున్నాడు. యాక్టీవా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ అగంతకుడు ఫోన్ చేసుకుని ఇస్తానని చెప్పడంతో రిహాన్ అతనికి ఇచ్చాడు. ఫోన్ మాట్లాడుతున్నట్లు నటించి అక్కడి నుండి పంజగుట్ట వైపు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ముషీరాబాద్: పూస స్వామి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు పూస రాజు ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్ జెమినికాలనీలో శివపార్వతుల కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, పిరెళ్ల చంద్రశేఖర్ జీ, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, పావనీవినయ్‌కుమార్, కే రవిచారి, పలు ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.

సందడిగా వనభోజన ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

లాలాపేట: తార్నాక కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం తార్నాకలో 3వ కార్తీక మాస వనభోజన ఆత్మీయ సమ్మేళన మహోత్సవ కార్యక్రమం సందడిగా జరిగింది. మాజీ మంత్రి మాండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, టీటీడీ బోర్డు పాలకమండలి సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు గూడూరు సత్యనారాయణ, భారతీయం సత్యవాణి, కిలారు దిలీప్,టీపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జెట్టి కుసుమ్ కుమార్ తదితరులు హాజరై మాట్లాడారు. సంఘ నిర్మాణానికి అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శివుడికి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆలరించాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, తార్నాక కమ్మారి సేవా సంఘం అధ్యక్షులు వల్లభనేని వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ



అడ్డగుట్ట: రైల్వే కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే ఏకైక కార్మిక సంఘం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అని సీ అండ్ డబ్ల్యూ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు రాధారి రామ్మోహన్ అన్నారు. రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో మజ్దూర్ యూనియన్‌కు మద్దతుగా శనివారం సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయం, రైల్వే స్టేషన్, రైల్వే వాషింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో సభ్యులు ఖలీల్ రెహ్మాన్, శ్యామ్, అర్జున్, సునీల్, రాజేష్, ప్రవీణ్, సరిత, సాయికుమార్, చంద్రశేఖర్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



పాఠశాల క్రీడాదినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణకుమార్ తదితరులు

రసూల్‌పురా: బోయిన్‌పల్లి పల్లవి మోడల్ స్కూల్ 28వ వార్షిక క్రీడోదినోత్సవ కార్యక్రమం శనివారం పాఠశాల మైదానంలో నిర్వహించారు. తెలంగాణ టెబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణకుమార్ మహేశ్వరి ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఏకగ్రాత పెంపొందించుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ ఆథారీటి ఆఫ్ కరాటే కోచ్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మల్కా కొంరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

అన్ని డివిజన్లలో పాగా వేస్తాం



సభ్యత్వ నమోదు వివరాలను శ్యాంసుందర్‌గౌడ్‌కు అందజేస్తున్న మర్రి పురూరవరెడ్డి

సనత్‌నగర్: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్దేశించిన సంఖ్యకు చేరువలో సభ్యత్వాలను చేయించామని బీజేపీ యువనేత మర్రి పురురవారెడ్డి అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు వివరాలను శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌కు ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎక్కడికి వెళ్లినా మోడీ పాలనను కొనియాడుతున్నారన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్, వివిధ డివిజన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

4న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు ఆహ్వానపత్రికను అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలోని రేణుకాఎల్లమ్మ దేవాలయ 16వ వార్షికోత్సవం, అమ్మవారి కళ్యాణోత్సవం డిసెంబరు 4వ తేదిన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబాను శనివారం కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఆలయ వార్షికోత్సవంతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్దసంఖ్యలో హజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు సీతారామ్, వీజే శేషగిరిరావు, సలహాదారులు మల్లేష్, రాజమౌళి, లక్ష్మణ్, సంజీవ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఓయూ రిజిస్ట్రార్‌ను కలిసిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



లాలాపేట: ఓయూ వాకర్స్ అసోసియేషన్ సభ్యుల బృందం శనివారం ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఇటీవలే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ. జి. నరేష్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మోతే శోభన్‌రెడ్డి, నాగేష్, పూర్ణచందర్,వివేక్ రెడ్డి, శ్రీధర్, పవన్, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో) టమాటా.43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 38, క్యాప్సికమ్ 55, పచ్చ కాకర 26, పందిరి బీర 45, క్యాబేజీ 31, క్యారెట్ 47, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 58, గోకరకాయ 28, కీర 26, దోసకాయ 27, బీట్‌రూట్ 43, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.